03122024-MAI-04_Layout 1 12/3/2024 4:17 AM Page 1

నేడు కాసోజు శ్రీకాంతాచారి అమరత్వం పొందిన రోజు

నమస్తే తెలంగాణ

మాఫీ హామీకే మాఫీ

దగా అంటే ఏమిటో.. మోసం ఎలా చేయవచ్చో.. రాష్ట్ర రైతాంగానికి తెలిసివచ్చినట్టుగా మరెవరికీ అనుభవంలోకి రాలేదు. నమ్మి నానా పోస్తే పుచ్చి బుర్రలైన కాంగ్రెస్ సర్కారు తీరే అందుకు కారణమని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అరచేతిలో స్వర్గం చూపినట్టు అన్నదాతలకు రైతు భరోసా ఆశచూపి అసలు రైతుబంధుకు ఎసరుపెట్టింది. ఈ కీలక హామీ అమలుపై అర్హులెవరో, అనర్హులెవరో తేలుస్తామనే సాకుతో మోకాలడ్డుపెట్టి ఏడాది కావస్తున్నది. ఇంకా మార్గదర్శకాలు, విధివిధానాలు, కమిటీలు, నివేదికలంటూ తాత్సారం చేస్తూనే ఉన్నది. టింగ్ టింగ్‌మని మోగే సెల్‌ఫోన్లు మూగబోయాయి. వడ్డీ వ్యాపారుల నుంచి రైతులను విముక్తం చేయాలన్న సమున్నత లక్ష్యంతో నాటి కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధుతో పాటు ఆపద కాలంలో ఆదుకునేందుకు రైతుబీమా పథకాన్ని కూడా అమలు చేసింది. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో కాలాలు మారుతున్నా రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం మాత్రం పడుతున్న దాఖలా కనిపించడం లేదు. లెక్కాపత్రం ఖరారు కాని కారణంగా కాంగ్రెస్ ఇచ్చిన మరో హామీ అయిన పంటల బీమా ఇంకా పట్టాలెక్కనే లేదు. ఇక మూడోది, రైతుకు అతి ముఖ్యమైనదీ అయిన రుణమాఫీ ఓ ప్రహసనంలా తయారైంది. ఏడాదికాలంలో సర్కారు రుణమాఫీపై వేసినన్ని కుప్పిగంతులు మరి దేనిమీదా వేయలేదేమో. రేపుమాపనే బుకాయింపులకు ఇక తెరపడినట్టే. సర్కారు తీరును పసిగట్టినవారు ఎప్పుడో ఆశలు వదులుకున్నారు. ఇంకా ఆశలు పెట్టుకున్నవారికి ఇంతే సంగతులు అని చావుకబురు చల్లగా చెప్పారు సీఎం రేవంత్‌రెడ్డి.

వందరోజుల్లోనే రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఎవరూ అప్పు తిరిగి కట్టరాదని, సోనియాగాంధీ కడతారని పీసీసీ అధ్యక్షుడి హోదాలో నాడు రేవంత్‌రెడ్డినే స్వయంగా అన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత సవాలక్ష సాకులతో ఎగ్గొట్టాలని చూశా రు. ఇప్పుడు సినిమా పూర్తి కాకుండానే సీఎం రేవంత్ 'ఎండ్ కార్డు' వేశారు. మొదట్లో రూ.39,000 కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పిన సర్కారే క్రమంగా అంచనాలను రూ.31 వేల కోట్లకు తగ్గించింది. మళ్లీ ఇప్పుడు రూ.20 వేల కోట్లతో సరిపెట్టి కాంగ్రెస్ పార్టీ తన నిజ స్వరూపాన్ని బహిర్గతం చేసుకున్నది. పంచ పాండవుల సామెతను గుర్తు చేస్తూ హళ్లికి హళ్లి, సున్నకు సున్న అని సరిపెట్టి చివరి విడత పూర్తయిందని దబాయించడం, బ్యాంకర్ల తప్పిదాలతో అంచనా రూ.11 వేల కోట్లు పెరిగిందని బుకాయించడం సీఎం రేవంత్‌కే చెల్లింది. తెల్ల రేషన్‌కార్డు లేని వాళ్లు, రూ.2 లక్షల పైచిలుకు రుణాలు కలిగినవాళ్ల మాటేమిటనేది ప్రశ్నగానే మిగిలింది.

రైతులు నల్లచట్టాలపై ఢిల్లీని ముట్టడించినప్పుడు వారి పక్షాన ఉన్న ట్టు కల్లబొల్లి కబుర్లు చెప్పిన కాంగ్రెస్‌కు రైతులపై ప్రేమ ఏ మాత్రం ఉందో రాష్ట్ర సర్కారు హామీలపై వేసిన కుప్పిగంతులే తెలియజేస్తున్నాయి. మరోవైపు భూముల స్వాధీనం పేరిట సాగిస్తున్న పోలీసు రాజ్యాన్ని మనం ఇప్పుడు చూస్తున్నాం. రైతన్నలు తిరగబడి విరగపోట్లు పొడిస్తే ప్రభుత్వం పలాయనం చిత్తగించడమూ జరుగుతున్నది. అమలు సాధ్యం కాని హామీలు, ఆపై గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ సర్కారు చేస్తున్న గారడీ తేటతెల్లమైపోయింది. అలవిమాలిన హామీలు ఇవ్వొద్దంటూ ఆ పార్టీ పెద్దలే సన్నాయి నొక్కులు నొక్కడం విడ్డూరం. కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణికి ఇది నిదర్శనం. ఎడాపెడా హామీలు ఇచ్చేసి, కొర్రీలతో కోతలు పెట్టే మోసకారి ధోరణిపై అన్నదాత కన్నెర్రజేసే రోజులు ఎంతో దూరంలో లేవని రేవంత్‌రెడ్డి సర్కార్ గుర్తిస్తే మంచిది.

ఏడాది పాలన.. బ్యాలెన్స్ షీట్

టంకశాల అశోక్

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి మరొక నాలుగు రోజుల్లో ఏడాది కాలం పూర్తవుతుంది. అందువల్ల, ఈ కాలంలో జరిగిన పరిపాలనా లతీరును సమీక్షించేందుకు ఇది తగిన సమయం. ఇప్పటికే కొన్ని మాసాలుగా పలు వ్యాఖ్యానాలు, పాగడ్తలు, విమర్శలు వస్తుండటం తెలిసిందే. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల గురించి. అవి వారే స్వయంగా పెట్టుకున్న వంద రోజుల గడువు నాటికి అమలుకావటం లేదా కాకపోవటంపై చర్చ చాలా జరిగింది. ఆ చర్చ రోజులు గడిచే కొద్దీ తీవ్రమవుతూ ఇప్పటికీ సాగుతున్నది.

ప్రభుత్వ పక్షం వారు, వంద రోజులంటే వందేనా, ఒక ఏడాది అయినా ఆగలేరా అంటూ వచ్చారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలు దీనిపై ఏమన్నాయన్నది అట్లుంచి ప్రజల దృష్టి నుంచి గమనిస్తే, వారిలో విమర్శించినవారితో పాటు, అవును ఒక ఏడాది పాటు చూద్దామన్న వారూ కన్పించారు. ప్రజలెప్పుడూ ఉదార స్వభావులే. మొత్తానికి ఇప్పుడు ఆ ఏడాది కాలం కూడా పూర్తవుతున్నందున పరిశీలన అవసరం.

మొదట గుర్తించవలసిన విషయం ఒకటున్నది. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారమంతా ఆరు గ్యారెంటీల చుట్టు తిరిగింది. అటువంటి గ్యారెంటీలే కర్ణాటక విజయానికి కారణమయ్యాయనే నమ్మకంతో తెలంగాణలోనూ అదే ప్రకటన చేయటం, వాటిని మామూలు పద్ధతిలో కర పత్రాలుగా కాక బాండ్ పేపర్లపై ముద్రించి మరీ రాష్ట్రమంతా ఇంటింటికి తిరిగి ఇవ్వటం, వేర్వేరు సామాజిక వర్గాలకు, వృత్తుల వారికి విడిగా డిక్లరేషన్లు తయారుచేసి, వివిధ పట్టణాలలో ప్రత్యేకంగా విడుదల చేయటం, వాటి విడుదల సభలలో కాంగ్రెస్ అధినాయకులు సోనియా గాంధీ, రాహు ల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే పాల్గొనటం, హామీల అమలుకు బాధ్యత తమదని ప్రకటిస్తూ, ఒకవేళ ఫిర్యాదులు ఏమైనా ప్రజలకు ఉంటే తమ దృష్టికి తేవాలనటం, చిన్న పిల్లవాడు ఫిర్యాదు చేసినా తను వెంటనే హైదరాబాద్ రాగలనని రాహుల్‌గాంధీ ప్రత్యేకంగా భరోసానివ్వటం, ఇవే అంశాలతో పత్రికలలో పూర్తి పేజీ అడ్వర్టయిజ్‌మెంట్లు వరుసగా వస్తుండటం వంటివన్నీ కలిసి ఆ రోజుల్లో, ఎన్నికల చరిత్రలోనే ఎన్నడూ లేని ఒక భిన్నమైన వాతావరణాన్ని సృష్టించాయి.

అది కాంగ్రెస్ పార్టీ స్వయంగా సృష్టించిన వాతావరణం. దాని ఉధృతికి తక్కినవన్నీ చాలావరకు కొట్టుకుపోయాయి. దీనంతటి ఫలితమే కాంగ్రెస్‌కు లభించిన అనూహ్య విజయం. అందువల్ల, పరిపాలనకు సంబంధించిన చర్చ యావత్తూ వంద రోజుల గడువు పూర్తయిన వెంటనే గాని, ఇప్పుడు ఏడాది సమయం ముగుస్తుండగా గాని, గ్యారెంటీల అమలు చుట్టు మాత్రమే కేంద్రీకృతం కావటం సహజం. ఇదే కాలంలో, ఆరు గ్యారెంటీలలో భాగంగా గల పద మూడు అంశాలతో పాటు, డిసెంబర్ 7న ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సోనియాగాంధీ జన్మదినమైన 9వ తేదీన, రైతులందరికీ ఒకే విడతలో, రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయగలమని, చేసి తీరగలమని, చేసి చూపించగలమని ఇచ్చిన మాట పద్నాలుగవ గ్యారెంటీగా మారింది. ప్రజల దృష్టిలో తక్కిన పరిపాలనాంశాలన్నీ వీటిచుట్టే తిరగటానికి ఈ కారణాలు కూడా సహజంగానే దోహదం చేశాయి.

చివరగా మరొక కారణం ఉన్నది. ఒకసారి ఈ గ్యారెంటీలతో పాటు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని మొత్తం అంశాలను ఒకవైపు, ప్రజల జీవితాలకు సంబంధించిన స్థితిగతులను మరొక వైపు పోల్చిచూసినపుడు, ఆయా అంశాల అమలుపై వారి ఆశలు ఒకేసారి ఆకాశం ఎత్తుకు లేవటం కూడా సహజమనిస్తుంది.

మనది వర్ధమాన సమాజం. సుదీర్ఘమైన ఫ్యూడల్ వ్యవస్థల నుంచి, దశాబ్దాల అంతర్గత వలస పాలన నుంచి బయటపడినప్పుడు ప్రజలకు, తెలంగాణ ప్రాంతానికి నూటొక్క సమస్యలుంటాయి. అటువంటి స్థితిలో, ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో ఏ ప్రభుత్వాలు చేయనన్ని చేసిందని చెప్పుకుంటూనే, కుప్పతెప్పలుగా వచ్చిపడిన గ్యారెంటీలతో మరింత ఆకర్షితులు కావటం సహజమైనరీతిలో జరిగింది.

ఈ రకరకాల పరిస్థితులన్నింటి కారణంగానే ప్రజలకు మొదటి వందరోజుల కాలానికి సంబంధించి గాని, ఇపుడు మొత్తం ఏడాది గురించి గాని, గ్యారెంటీలన్నవే అన్నింటికన్న ప్రధానంగా మారి దృష్టిలో నిలిచాయి. మరొక విధంగా చెప్పాలంటే తమ దైనందిన జీవితాలలో, వృత్తి వ్యాపకాలలో ప్రధానమయ్యాయి. ఇప్పుడు ఏడాది కూడా ముగుస్తున్నందున, ఏడాదిలో కొత్తగా రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, మొదటి ఏడాదిలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, ప్రతి ఏడాది జూన్ 2 నాటికి అన్ని శాఖల్లోని ఖాళీలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించి సెప్టెంబర్ 17లోపు నియామకాల పూర్తి, నిరుద్యోగ యువతకు ఉద్యో గ, ఉపాధి అవకాశాలు కల్పించేవరకు ప్రతి నెల రూ.4,000 నిరుద్యోగ భృతి చెల్లింపు, ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12,000 సహాయం, పేద ఆడపిల్లల పెళ్లిళ్లకు లక్ష రూపాయలతో పాటు ఇందిరమ్మ కానుకగా తులం బంగారం, పింఛన్ల పెంపు వంటివి వంద రోజులలో ఆరు గ్యారెంటీల అమలు హామీకి అదనంగా ప్రజల చర్చలోకి వస్తున్నాయి. ఇవేవీ అమలు కావటం లేదన్నది విషయం. ఈ ప్రశ్నలకు ప్రభుత్వం జవాబివ్వటం లేదన్నది సమస్య. భరో సాలిచ్చినా రాహుల్ గాంధీ తదితరులు ఇటు ఒక్క సారైనా తొంగిచూడకపోవటం మరొక సమస్య.

గ్యారెంటీలను పరిశీలిస్తే, గ్యారెంటీ కార్డులో పేర్కొన్న 13 అంశాలలో మహిళలకు ఉచిత బస్సు పూర్తిగా, రూ.500కు గ్యాస్ సిలిండర్, వరికి రూ.500 బోనస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ అనే నాలుగు అరకొరగా అమలవుతున్నాయి. వరికి సంబంధించి మొదట అన్నివడ్లూ అని చెప్పి ఇప్పుడు సన్నాలు మాత్రమేనంటూ మాట తప్పారు. వరి కాకుండా మరొక 9 రకాల పంటలకు మద్దతు ధర పెంపును కొత్త రేట్లతో సహా ప్రకటించి మరిచిపోయారు. ఇట్లా ఒక పూర్తి, నాలుగు అరకొర కలిపి ఐదింటిని మినహాయిస్తే తక్కిన తొమ్మిదింటి అసలు ఊసే లేదు. ఈ జాబితాకు రుణమాఫీ, ఉద్యోగాల వంటివి కలిపి చూసినట్టయితే, వైఫల్యాల తీవ్రత ఇంకా బాగా అర్థమవుతుంది. వీటితోనే బాధపడుతున్న ప్రజలకు రుణమాఫీపై అబద్ధాలు, గత ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లను తమవిగా చెప్పుకోవటం, ఇంకా ఇతర అబద్ధాలు, రోజుకో మాట మార్చటం, కేసీఆర్ ఆనవాళ్లన్నీ తుడిచివేస్తాననటం, మంత్రులు తలో విధంగా మాట్లాడటం, సీఎం రేవంత్ భాష, గత ప్రభుత్వ పనులను తనవి అనటం, రోజుకో దర్యాప్తు ప్రకటనల వంటివి ప్రజలకు పుండుమీద కారం చల్లినట్టు అవుతున్నాయి. ఇటీవలకి వస్తే చెరువులు, మూసీ ప్రక్షాళన పేరిట పేదలపై జరిగినవి, లగచర్ల మొదలైన ఘటనలు, ప్రభుత్వ హాస్టళ్లలో పిల్లల మరణాలు, ప్రజాస్వామిక నిరసనలపై పోలీసుల అణచివేతలు అన్నివర్గాల వ్యతిరేకతలకు కారణమవుతున్నాయి. వీటన్నింటి మధ్య ఏమైనా మంచి జరిగినా ప్రజల దృష్టిలో విలువ ఉండటం లేదు. కాని అది ప్రభుత్వ స్వయంకృతం.

ఈ విధంగా ముగుస్తున్న రేవంత్ ప్రభుత్వ ఏడాది కాలం, మున్ముందు అయినా మెరుగు ప డగలదనే ఆశ కన్పించటం లేదు. ఆర్థిక పరిస్థితి తనకు బాగా తెలుసునన్నట్టు ఎన్నికల ప్రచారం లో చెప్పిన ఆయన, అధికారం కోసం అసాధ్యపు హామీలివ్వటం ఇందుకు ఒక కారణమైతే, అవగాహనాలోపం, అనుభవ లేమి, వ్యక్తిగతంగా అపసవ్యపు ధోరణి ఇతర కారణాలవుతున్నాయి. కనీసం రాగల కాలంలోనైనా ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచి తమ మ్యానిఫెస్టోను, గ్యారెంటీలను అమలుపరచగల నాయకత్వ సమర్థత గాని, వ్యక్తిగత లక్షణాలను మార్చుకొని, ప్రజల దృష్టిలో గౌరవాన్ని, విశ్వాసాన్ని సంపాదించుకోగల తీరు గాని ఆయనలో కన్పించటం లేదు. ఏడాది పాలనను ఆడిటింగ్ చేస్తే తేలుతున్న బ్యాలెన్స్ షీట్ ఈ విధంగా ఉంది.

మన దేశం అనాదిగా నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో కూరుకుపోయింది. అయితే, ఈ వ్యవస్థలో దళితులను అట్టడుగు స్థానంలో ఉంచడం దారుణం. తద్వారా దళితవర్గాలు వేల ఏండ్ల నుంచి సామాజిక హక్కులకు నోచుకోక.. అస్పృశ్యత, అంటరానితనాన్ని అనుభవించారు. అందుకే, వారి అభ్యున్నతి కోసం అంబేద్కర్ నాడు రాజ్యాంగంలో 15 శాతం రిజర్వేషన్లు కల్పించారు. షెడ్యూల్డ్ కులాల్లో 59 ఉపకులాలు ఉండగా.. ప్రధానంగా మాదిగ, మాలలు అత్యధికంగా ఉన్నారు. అయితే, వారిలో జనాభాపరంగా అత్యధికంగా ఉండి, వెనుకబడిన కులం మాదిగ.

అధిక వాటా సమంజసమా?

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మాదిగలను పలు రకాల పేర్లతో పిలుస్తారు. ఉమ్మడి ఏపీలో మాలలతో పోలిస్తే మాదిగలే అత్యధికులు. కానీ, వారు విద్య, ఉద్యోగ, రాజకీయపరంగా వెనుకబడ్డారు. మెజారిటీలైన మాదిగ కులానికి రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లలో తగిన వాటా దక్కకపోవడమే అందుకు ప్రధాన కారణం. ఈ విషయాన్నీ పలు కమిషన్లు కూడా ధృవీకరించాయి. దళిత సామాజికవర్గంలోని మాల, మాదిగ వర్గాల నడుమ అసమానతల కారణంగా ఈ రెండింటి మధ్య వైరుధ్యం పెరిగింది.

ఈ నేపథ్యంలోనే మందకృష్ణ మాదిగ, తదితర మాదిగ మేధావుల నేతృత్వంలో 1994న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పడింది. దీని ఆధ్వర్యంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమం మొదలైంది. దీంతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1996లో వర్గీకరణ అంశంపై జస్టిస్ పి.రామచంద్రమూర్తి కమిషన్‌ను నియమించారు.

వెనకబాటుతనం ఆధారంగా షెడ్యూల్డ్ కులాలను ఏ, బీ, సీ, డీ అనే నాలుగు వర్గాలుగా వర్గీకరణ చేయాలని ఈ కమిషన్ సిఫారసు చేసింది. అంతేకాదు, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను విద్య, ఉద్యోగాల్లో వర్తింపజేయాలని సూచించింది. ఈ కమిషన్ నివేదిక మేరకు 2000 సంవత్సరం నుంచి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను అమలుపరిచారు. దీని ప్రకారం బీ వర్గంలో ఉన్న మాదిగలకు 7 శాతం, సీ వర్గంలో ఉన్న మాలలకు 6 శాతం, ఇతర ఉపకులాలకు మిగతా శాతాన్ని వర్తింపజేశారు. దీంతో కొంతవరకు మాదిగలకు విద్య, ఉద్యోగాల్లో లబ్ధి చేకూరింది.

అయితే, ఎస్సీ కులాల్లో సామాజిక సమానత్వం కోసం అమలు పరిచిన ఉప వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల సోదరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో ఉమ్మడి ఏపీలో అమల్లో ఉన్న ఎస్సీ ఉప వర్గీకరణను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇదే ఈవీ చెన్నయ్య వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా-2004 కేసుగా పేర్కొంటారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మాదిగ ఉప కులాలు నిరసన వ్యక్తం చేసి, వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చాయి. దీంతో 2007లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఉషా మెహ్రా కమిషన్‌ను నియమించింది. రిజర్వేషన్ల వర్గీకరణ అవసరమని ఈ కమిషన్ కూడా నొక్కివెప్పింది. కానీ, ఓట్ల రాజకీయం కోసం ప్రభుత్వాలు ఇన్నాళ్లు దాటవేశాయి. ఇటీవల స్టేట్ ఆఫ్ పంజాబ్, ఇతరులు వర్సెస్ దేవీందర్‌సింగ్ కేసులో గతంలో ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించి 2024 ఆగస్టు 1న రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుతో 20 ఏండ్ల నిరీక్షణకు తెరపడింది.

సుప్రీం కోర్టు తీర్పులో పలు విషయాలను ప్రస్తావించింది. ఎస్సీ కులాల్లో ఎక్కువ, తక్కువలున్నాయని చెప్పింది. సామాజిక, ఆర్థిక స్థితిగతుల గణాంకాలను సేకరించి, వాటి ఆధారంగా వర్గీకరణ చేయాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ తీర్పు తర్వాత మాలల్లో అలజడి మొదలైంది. మాల, మాదిగ సోదరుల మధ్య విమర్శలు తీవ్రస్థాయికి చేరాయి. ఈ రెండు కులాల మధ్య వైషమ్యాలు మరింత పెరిగిపోతుండటం విచారకరం. ఈ విమర్శల పరంపరలో రాజకీయ నాయకులు భాగం కావడం ఆందోళనకరం.

మాలలతో పోలిస్తే మాదిగలు వెనకబడ్డారనేది వాస్తవం. మాదిగలు ఇప్పటికీ పారిశుద్ధ్య కార్మికులుగా జీవిస్తున్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో మాదిగలు వెనుకబడ్డారు. వాస్తవానికి, ఏపీలో మాలల జనాభా ఎక్కువ. బ్రిటిష్ పరిపాలనలో ఆంధ్ర ఉన్న సమయంలోనే వీరు విద్య, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకున్నారు. నైజాం పాలనలో ఉన్న మాదిగలు మాత్రం చర్మకార వృత్తికే పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో మాదిగలు కన్నా తక్కువ సంఖ్యలో ఉన్న మాల సోదరులు రిజర్వేషన్లలో మెజారిటీ వాటాను కోరడం ఎంతవరకు సబబు?

ఏండ్ల నుంచి అణచివేతకు గురైన జాతిగా మాదిగ సమాజం సామాజిక వివక్షను అనుభవిస్తున్నది. అణచివేతకు గురైన వర్గాన్ని, ఆధిపత్యం వర్గంతో సమానం చేయడానికే కదా రిజర్వేషన్లను అంబేద్కర్ కల్పించారు. ఈ క్రమంలో రిజర్వేషన్ ఫలాల్లో కూడా అసమాన పంపిణీ జరగడం వల్ల మరింత నష్టం చేకూరుతుంది. కాబట్టి, జనాభా ప్రాతిపదికన నిష్పక్షపాతంగా ఎస్సీ వర్గీకరణ చేయాల్సిన అవసరం ఉన్నది.

సంపతి రమేష్ మహారాజ్
79795 79428
(వ్యాసకర్త: సామాజిక విశ్లేషకులు)

మళ్లీ కల్లోలితం.. తెలంగాణ కకావికలం

డాక్టర్ ఆంజనేయ గౌడ్

రోజువారీ అలవాటులో భాగంగా సోమవారం దినపత్రిక చేతిలోకి తీసుకోగానే పతాకవార్తగా తుపాకుల మోత కంటపడింది. ఏటూరునాగారం అడవుల్లో ఏడుగురికాల్చివేత దుర్వార్తను చదవాల్సి రావడం బాధాకరం. పదేండ్ల కిందట ప్రతి ఉదయం మోసుకొచ్చే నెత్తుటి సమాచారమే మళ్లీ పునరావృతమైపోయింది. వినకూడని, కనకూడని, కలలో కూడా రాకూడదనుకునే రాజ్యం రాసే రక్త చరిత్రను, మళ్లీ తెలంగాణ చదువుకోవాల్సిన దుస్థితి దాపురించింది. పాత దుర్దినాలు మరిచి, పదేండ్ల పాటు ప్రగతి వార్తలకు అలవాటు పడిన సమాజం, ఏడాదిగా ప్రభుత్వం నోటి నుంచి జాలువారుతున్న అబద్ధాన్ని, విసురుతున్న చేతి వాటాన్ని, మోపుతున్న నిర్బంధాన్ని చవిచూస్తున్నది. ఏడాదిలోనే అంతటా అలజడి, అన్ని వర్గాల్లోనూ ఆందోళన అలుముకున్నది.

రాష్ట్రాన్ని వెనక్కి నడిపిస్తూ, ప్రజలను నిర్బంధంలోకి నెడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ సాగిస్తున్న అమానవీయ పరిపాలనపై అందరిలో ఆవేదన నిండుకున్నది. రాష్ట్ర ఆవిర్భావానికి మునుపు ఎలాంటి భయానక భౌతిక పరిస్థితి తెలంగాణలో ఉండేదో, ఏడాదిగా అదే విధమైన గడ్డుకాలం అన్ని గడపల్లోకి వచ్చిపడింది. అలజడి, ఆందోళన, అణచివేత అంతటా మళ్లీ వర్ధిల్లుతున్నది. పల్లెల్లో ఇనుప బూట్ల కవాతు, లాఠీల కోలాటం, సంకెళ్ల సవ్వడి, తుపాకుల గర్జన మళ్లీ మామూలైపోయింది. అక్రమ అరెస్టులు, బూటకపు ఎన్‌కౌంటర్ల వార్తలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇప్పుడు తెలంగాణ నిప్పుల కుంపటిని నెత్తిన పెట్టుకొని దుఃఖిస్తున్నది. తెలంగాణకు మళ్లీ ఏ దుస్థితి రాకూడదనుకున్నామో, అదే విషమ పరిస్థితి రాష్ట్రమంతటా విస్తారమైపోయింది.

శనివారం నాడు పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్, ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయానికి వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఆదివాసీలపై ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర సర్కార్ సాగిస్తున్న దారుణ దమనకాండకు వ్యతిరేకంగా, దేశ రాజధానిలో నిర్వహిస్తున్న సభకు విపక్ష పార్టీల మద్దతు కోరుతూ, తెలంగాణ భవన్‌కు వారొచ్చారు. ఆ సందర్భంగా కేంద్ర సర్కారే కాదు, రేవంత్‌రెడ్డి సర్కార్ కూడా హక్కుల హననంలో ఏడాదిలోనే ఎలా కర్కోటకంగా వ్యవహరిస్తున్నదో వారితో చర్చకు వచ్చింది. ఎన్నికలకు ముందు ఏడో గ్యారెంటీ పేరిట కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేసిన స్వేచ్ఛను, నేడు ఎలా చెరసాలల్లో ఖైదు చేస్తున్నారనే అంశంపై లోతైన చర్చే నడిచింది. ఇప్పుడు రాష్ట్రమే ఆంక్షల వలయంలో, నిర్బంధం నీడలో విలవిలలాడుతున్నది. ఈ వికారమైన మార్పును నిలువరించకపోతే, తెలంగాణ స్వాభావిక ఔన్నత్యం మసకబారిపోతుందని అందరం చర్చించుకున్నాం. పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వ ప్రగతి పోరులో, పరుగులో భాగంగా, ప్రభుత్వంలోని వ్యవస్థగత సంస్థల ఏమరుపాటుతో ఒకటో రెండో పొరపాట్లు దొర్లి ఉండవచ్చు. కానీ, వికాసానికి విరుద్ధంగా నేడు రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రయోగిస్తున్న దమనకాండ రాష్ట్రానికి ప్రమాదకరంగా మారిపోయింది.

దేశంలో ప్రభుత్వాల పగ్గాలు వివిధ కారణాలతోనో, ప్రేరకాల ప్రభావ రీత్యానో రాజకీయ పార్టీల చేతులు మారడం సాధారణంగా జరిగేదే. కానీ, మారిన ప్రభుత్వం ఏ నమూనా నెత్తిన పెట్టుకొని నడుస్తున్నదనేది తొలి ఏడాది పాలనలో తేటతెల్లమైపోతుంది.

గతంలో ఉమ్మడి రాష్ట్రంలో 2 రూపాయలకు కిలో బియ్యం, పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు, బలహీన వర్గాల సంక్షేమం లాంటి అనేక అభ్యుదయ పథకాలు అమలుపరిచిన ఎన్టీఆర్ సర్కార్ కూడా 1989 ఎన్నికల్లో ఓడిపోయింది. కానీ, తదనంతర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశలను ఎలా తగులబెట్టిందో, తర్వాతి ఎన్నికల్లో ఏం జరిగిందో చరిత్రలో ఉండనే ఉన్నది. కాంగ్రెస్ చరిత్ర, రేవంత్‌రెడ్డి లాంటి వారి నేపథ్యం, స్వభావం తెలిసి తెలిసి, మధ్య తరగతి, బుద్ధి జీవులు మళ్లీ హస్తం పార్టీ విష ప్రచారం వలకు ఎరకావడమే తెలంగాణకు ఇక్కట్లు తెచ్చిపెట్టింది. తెలంగాణ పునాది సమూహమైన సామాజిక వర్గాలకు ఉన్న రాజకీయ స్పష్టత, నాలుగు అడుగులు ముందుకు జరిగిన వర్గాలకు కరువవ్వడం వల్ల, ఇప్పుడు మళ్లీ తెలంగాణ తల్లడిల్లుతున్నది. కడుక్కున్న చేతులు ప్రదర్శించినంత మాత్రాన, నేర చరిత్ర, స్వభావం ఏ సంస్థ నుంచైనా, అందునా కాంగ్రెస్ నుంచి మాయమైపోతుందా..?. దానివల్లనే కాంగ్రెస్ మార్క్ అమానవీయ పరిపాలనను ఏడాదిగా ఎదుర్కోక తప్పటం లేదు. చరిత్రలో కాంగ్రెస్ పార్టీ పెంచిన జైళ్లు, పండించిన వంచన, పారించిన నెత్తురు అవగాహనపరులకు తెలియదా..? వృద్ధిని ఉరికొయ్యకు వేలాడదీసే హస్తం పార్టీ ప్రభుత్వాల సహజత్వం, దశాబ్దాలుగా మన దేశం, రాష్ట్రం మోసిన సత్యం మరిస్తే ఎలా..?. ప్రభావితవర్గాల తొందరపాటు, సమాజానికి ఎంత నష్టం చేస్తుందో, తెలంగాణకు అనుభవంలోకి వచ్చింది. సొంత ఊరిలో మాజీ సర్పంచ్ మరణానికి కారణమవ్వడమేకాక, స్వప్రయోజనాల కోసం, సొంత నియోజకవర్గ పేద, గిరిజన రైతులను హింసించి, జైళ్లపాలు చేసిన రేవంత్‌రెడ్డి సర్కార్, రాష్ట్రాన్ని మాత్రం వదిలేస్తుందా..?. అందుకే ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు, న్యాయం అడిగినోళ్లందరికీ బేడీలు తొడిగేస్తున్నది.

నిర్బంధాన్ని విస్తరించి, జనాన్ని భయంతో నిలువరించడం ప్రజా ప్రభుత్వం ఎలా అవుతుంది? ప్రజలపై రాజ్యహింస విజయం సాధించిన చరిత్ర ఏ దేశంలో, రాష్ట్రంలోనైనా ఉన్నదా..?. అయినా సరే అవకాశం దొరికిన ప్రతిసారి కాంగ్రెస్ అదే నియంతృత్వ నమూనాను అనుసరించడం సర్వ సాధారణం. ఏడాదిలో ఎన్ని సార్లు నేరాలు తెలంగాణలో జరిగా యో లెక్కే లేదు. సీఎం రేవంత్ సొంత జిల్లాలోనే షాద్‌నగర్‌లో దళిత మహిళపై థర్డ్ డిగ్రీ సంఘటన, నాగర్‌కర్నూల్ జిల్లాలో రైతులపై థర్డ్ డిగ్రీ, బీఆర్ఎస్ నేత శ్రీధర్‌రెడ్డి దారుణ హత్య, లగచర్లలో గిరిజనులపై అమానుషం ఇలా ఎన్నో దారుణాలు యథేచ్ఛగా జరిగిపోయాయి. ఇక రాష్ట్ర వ్యాప్తంగా దాడ